క్లుప్తంగా

నేడు భజగోవింద సుధ గ్రంథావిష్కరణ

చీరాల రూరల్: ఆధ్యాత్మిక పీఠం చీరాల ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు స్వర్ణరోడ్డులోని వాసవీ హైస్కూలులో భజగోవింద సుధ గ్రంథం ఆవిష్కరించనున్నట్లు ఆధ్యాత్మిక పీఠం అధ్యక్షుడు ఊటుకూరి వెంకటరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు హాజరై భగవంతుడి కృప పొందాలని ఆయన కోరారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి స్వాతికిరణ్

వేటపాలెం: స్థానిక సర్వోదయ కాలనీలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యాధికారి స్వాతి కిరణ్, మరో ముగ్గురు వైద్యుల పర్యవేక్షణలో 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్‌కి ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

అక్షరాస్యులుగా మార్చడమే లక్ష్యం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ట్రైనర్

మేదరమెట్ల: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు విద్య విలువను తెలుసుకొని నిరక్ష్యరాస్యులందరూ అక్షరాస్యులుగా మారాలని అడల్ట్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ సూపర్‌వైజర్ టీ.పోతురాజు అన్నారు. మండల కేంద్రం కొరిశపాడు మండల సమాఖ్య డీఆర్‌డీఏ వెలుగు కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఉల్లాస్ వందరోజుల కార్యక్రమంలో నిరక్ష్యరాస్యులను అక్షరాస్యులుగా మర్చడమే లక్ష్యంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. 17 సంవత్సరాలు నిండిన మహిళలను, పురుషులను గుర్తించి వారి అక్షరాస్యులుగా తీర్చి దిద్దేందుకు మహిళా సమాఖ్య సభ్యులు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో సీసీలు సాంబయ్య, మేరీకుమారి, మస్తాన్‌వలి, సునీత పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్తపై కేసు

చినగంజాం: అదనపు కట్నం తెమ్మని వేధిస్తున్న భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ శీలం రమేష్ వివరాల మేరకు.. మండలంలోని కడవకుదురు గ్రామానికి చెందిన రెడితి నాగమణికి 2004లో చీరాల ముత్యాలపేటకు చెందిన రెడితి పూర్ణచంద్రరావుతో వివాహం జరిగింది. వివాహ సమయంలో నాగమణి తల్లిదండ్రులు కట్నం కింద నగదు, బంగారం, ఇంటి సామగ్రి అందజేశారు. ఈ క్రమంలో తన భర్త చెడు వ్యసనాలకు బానిసై అదనపు కట్నం తెమ్మని ఆమెను శారీరకంగా, మానసికంగా హింసిస్తున్నారని చెప్పింది. అందుకు తన అత్తమామలు బాలకోటయ్య, కోటేశ్వరమ్మలు కూడా పూర్తిగా సహకరిస్తూ వేధిస్తున్నట్లు ఆమె గురువారం చినగంజాం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

శింగరకొండ దర్శిని



అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, కార్తీక మాసం, ఉత్తరాషాఢ నక్షత్రం, సప్తమి తిథి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

అద్దంకి రూరల్: వాహనదారులు రహదారి నిబంధనలు పాటించాలని ఎస్సై ఖాదర్‌బాషా పేర్కొన్నారు. గురువారం అద్దంకి పట్టణంలో సాయంత్రం ఎస్సై తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు లైసెన్స్ లేకుండా నడపరాదన్నారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్ లేకపోతే భారీ జరిమానా విధిస్తారని చెప్పారు. కొత్త చట్టాల ప్రకారం మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానులకు శిక్ష పడుతుందని చెప్పారు. కార్యక్రమంలో పలు వాహనాలకు జరిమానా విధించారు.

నాడు బీడు.. నేడు సిరులు

- సిరులు కురిపిస్తున్న తీరప్రాంత ఇసుక భూములు
- ప్రాణం పోస్తున్న ఎత్తిపోతల పథకాలు
- సంవత్సరానికి మూడు పంటలు



స్ప్రింక్లర్ల సహాయంతో సాగవుతున్న వేరుశనగ

వేటపాలెం: 'తివిరి యిసుమున తైలంబు దీయవచ్చు'.. అన్న భర్తృహరి సభాషితాలు నిజం చేస్తున్నారు రైతన్నలు. ఒకప్పుడు ఎందుకూ పనికి రావనుకున్న తీరప్రాంత ఇసుక భూములు ఇప్పుడు రైతులకు సిరులు కురిపిస్తున్నాయి. ఈ భూముల్లో రైతులు సంవత్సరానికి మూడు పంటలు పండిస్తున్నారు. వర్షాకాలంలో వరి, వేసవిలో వేరుశనగ, చేమదుంప, మొక్కజొన్న, మిరప, కాయగూరల పంటలు సాగుచేస్తున్నారు. ఈ భూములకు మూడు ప్రాంతాల్లోని ఎత్తిపోతల పథకాల కింద దాదాపు 8 వేల ఇసుక భూములకు సాగునీరు పుష్కలంగా అందుతోంది. బోరుబావుల ద్వార వేరుశనగ పంటలకు స్ప్రింక్లర్ల సహాయంతో పంట పండిస్తున్నారు. 17 ఏళ్ల కిందట తీరం వెంట ఇసుక భూముల్లో సాగుకు పనికిరాని భూములుగా పేరుండేది. ఆ భూముల్లో సరుగుడు, జీడిమామిడి తోటలు పెంచేవారు. వీటిని అప్పటిలో అడవి ప్రాంతాలుగా పిలుచుకునే వారు. అయితే ఎత్తిపోతల పథకాలు ప్రారంభించిన తరువాత ఇసుక భూముల్లో ఉన్న సరుగుడు, జీడిమామిడి తోటలను తొలగించి ఆ భూముల్లో వరి, వేరుశనగ పంటలు సాగుచేస్తున్నారు.

ఎత్తిపోతల పథకాలతో మారిన తలరాత..

వేటపాలెం మండల పరిధిలో తీరప్రాంతాల వెంట స్ట్రయిట్ కట్ కాల్వలపై మూడు ఎత్తిపోత పథకాలు ఉన్నాయి. అక్కాయిపాలెం ఎత్తిపోతల పథకం, నాయినపల్లి, మోటుపల్లి ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. ఈ మూడు ఎత్తిపోతల పథకాల పరిధిలో 8 వేల ఎకరాల్లో ఇసుక భూముల్లో రైతులు పంటలు పండిస్తున్నారు. పాపాయిపాలెం, అక్కాయిపాలెం, చల్లారెడ్డిపాలెం, కఠారివారిపాలెం, పొట్టిసుబ్బయ్యపాలెం, కొత్తపాలెం, బచ్చులవారిపాలెం, కొత్తరెడ్డిపాలెం, పాతరెడ్డిపాలెం, మోటుపల్లి ప్రాంతాల్లోని భూముల్లో మూడు పంటలు పండిస్తున్నారు. వీటితో పాటు వేసవిలో ఇసుక భూముల్లో ఆరుతడి పంట అయిన వేరు శనగ, చేమదుంప, మొక్కజొన్న, కాయగూరలు, పంటల సాగు చేపట్టారు. పంట భూముల్లోనే బోర్లు ఏర్పాటు చేసుకొని మోటార్ల సహాయంతో స్ప్రింక్లర్లతో వేరుశనగ పంట సాగు చేసుకుంటున్నారు. వర్షాకాలంలో ఎత్తిపోతల పథకం ద్వారా వరి పైరు సాగు చేశారు.

భారీగా పెరిగిన తీరప్రాంత భూముల విలువ..

తీరప్రాంతంలో గత ప్రభుత్వం కోట్ల నిధులతో సముద్రతీర గ్రామాలకు తారు రోడ్డు సౌకర్యం కల్పించింది. దీనికి తోడు ఎత్తిపోతల పథకాలతో తీర ప్రాంత భూములో మంచి పంటలు సాగు చేగు చేస్తున్నారు. గతంలో ఈ భూముల విలువ రూ. 20 వేలు ఉండేది. ప్రస్తుతం ఈ భూముల విలువ బహిరంగ మార్కెట్‌లో రూ. 30 లక్షల నుంచి రూ. 2 కోటి పలుకుతోంది. దీనికి తోడు ఒంగోలు టూ దిగమర్రు జాతీయ రహదారి సముద్ర తీర ప్రాంతం నుంచి వెళ్తుండటంతో ఈ భూములుకు మంచి గిరాకీ ఏర్పాడింది. చీరాల, వేటపాలెం సముద్ర తీరం వెంట భారీగా రిసార్టులు ఏర్పాటు చేయడంతో పర్యాటకుల సందడి విపరీతంగా పెరిగిపోయింది. నిత్యం తీర వద్ద సినిమా షూటింగ్‌లతో పాటు బుల్లితెర సీరియల్స్ కూడా తీస్తున్నారు.

శిశువుల రక్షణ బాధ్యత అంగన్‌వాడీలదే



మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ మహిళా ప్రతినిధి ఈశ్వరిరెడ్డి

చీరాల రూరల్: శిశువులను కన్నబిడ్డల్లా చూసుకుంటూ విద్యాబుద్ధులు నేర్పించి వారిని మంచి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దే బాధ్యత అంగన్‌వాడీలదేనని మహిళా న్యాయవాది జీకే ఈశ్వరిరెడ్డి అన్నారు. శిశు సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉన్నత న్యాయ స్థానాల ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ చీరాల ఆధ్వర్యంలో గురువారం వైకుంఠపురంలోని అంగన్‌వాడీ కేంద్రంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో చీరాల బార్ అసోసియేషన్ మహిళా ప్రతినిధి, న్యాయవాది ఈశ్వరిరెడ్డి, చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ రాజ్‌కుమార్‌లు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్లు ఎస్‌డీ. మతిన్, సాయికృష్ణ, ఎస్ఎం. సుభాని, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్. గ్లోరి విజయకుమారి, ఎస్. ఇంద్రాణి, కె. రోజా కుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో ఉజ్వల భవిష్యత్



ఏ గ్రేడు సర్టిఫికెట్లు అందుకున్న ఎన్‌సీసీ విద్యార్థులు

చీరాల రూరల్: ఎన్‌సీసీలో చేరిన విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉందని 23 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ సుబేదార్ రేఖారామ్ అన్నారు. స్థానిక మరియమ్మపేటలోని సెయింట్ ఆన్స్ స్కూలులో ఎన్‌సీసీ కోర్సు పూర్తిచేసుకున్న 50 మంది ఎన్‌సీసీ విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సుబేదార్ మాట్లాడుతూ ఎన్‌సీసీలో చేరడం వలన విద్యార్థిలో మంచి క్రమ శిక్షణ అలవడడమే కాకుండా చదువులో ముందుంటారని చెప్పారు. మానసికంగా, శారీరకంగా ఎంతో పరిపక్వత చెందుతారన్నారు. ఏ గ్రేడులు సాధించిన విద్యార్థులను, ఎన్‌సీసీ ఇన్‌స్ట్రక్టర్ గొర్ల గోపినాథ్‌ను ప్రిన్సిపాల్ సిస్టర్ జీనా జేవియర్ అభినందించారు. అనంతరం సుబేదార్ రేఖారామ్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సిస్టర్ ఎల్లా ట్రిసా, పీటీలు బోయిన ధనుంజయ, విజయనిర్మల, సురేష్ పాల్గొన్నారు.

కార్తీకంలో పుణ్యక్షేత్రాల దర్శనం

- చీరాల డిపో నుంచి పంచారామాలకు ప్రత్యేక బస్సులు



చీరాల ఆర్టీసీ బస్టాండ్

చీరాల అర్బన్: కార్తీక మాసంలో పుణ్యక్షేత్రాలను సందర్శించే భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. పంచారామ క్షేత్ర దర్శిని పేరిట పంచారామాలకు, శ్రీశైలం, శబరిమలకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. చీరాల డిపో నుంచి పంచారామాలకు ఎక్స్‌ప్రెస్, అల్ట్రా డీలక్స్, సూపర్‌లగ్జరీ బస్సులను అందుబాటులో ఉంచినట్లు డిపో మేనేజర్ జె.శ్యామల తెలిపారు.

ఈ తేదీల్లో పంచారామాలకు..

పంచారామదర్శిని పేరిట ఈనెల 10, 17, 24 తేదీల్లో పంచారామాలైన అమరారామం (అమరావతి), సోమారామం (భీమవరం), క్షీరారామం (పాలకొల్లు), ద్రాక్షారామం (ద్రాక్షారామం), కుమారరామం (సామర్లకోట) ప్రాంతాలకు ఒక రోజులో దర్శనం చేసుకునేందుకు పంచారామ దర్శిని పేరిట ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. నిర్ణయించిన తేదీల్లో ఆదివారం రాత్రి 8 గంటలకు డిపో నుంచి బస్సులు బయలుదేరి సోమవారం సాయంత్రం వరకు శైవ క్షేత్రాలకు భక్తులకు తీసుకు వెళ్తారు. దర్శనం అనంతరం అదే రోజు రాత్రి 8గంటలకు తిరిగి డిపోకు చేరుతాయి. భక్తులు కోరిన మేరకు అదనపు బస్సులను నడిపేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

టికెట్ ధరలు ఇలా..

చీరాల డిపో నుంచి పంచారామాలకు ఎక్స్‌ప్రెస్ సర్వీసుకు పెద్దలకు టికెట్ రూ.1035, పిల్లలకు రూ.795, అల్ట్రా డీలక్స్ పెద్దలకు రూ.1315, పిల్లలకు రూ.1005, సూపర్‌లగ్జరీ సర్వీసుకు పెద్దలకు రూ.1375, పిల్లలకు రూ.1035, ప్రతి టికెట్‌పై రూ.20 రిజర్వేషన్ చార్జి ఉంటుంది. శైవ క్షేత్రాలకు కార్తీక మాసంలో శ్రీశైలం, భైరవకోన, మహానంది వంటి పుణ్యక్షేత్రాలకు కూడా అద్దె ప్రాతిపదికన ఆర్టీసీ చీరాల డిపో నుంచి ప్రత్యేక బస్సులను నడపనున్నారు. పూర్తి వివరాలకు 73828 89757, 73828 88959 నంబర్లకు సంప్రదించవచ్చు.

> **పంచారామ దర్శినిని సద్వినియోగం చేసుకోవాలి..**
>
> 
>
> పంచారామాలకు ప్రత్యేక ప్యాకేజితో ఏర్పాటు చేసిన బస్సులను ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలి. తక్కువ చార్జీలతో సురక్షితంగా పుణ్యక్షేత్రాలను సందర్శించేందుకు వీలుగా వీటిని ఏర్పాటు చేశాం. బస్టాండ్‌లోని రిజర్వేషన్ కౌంటర్లలో టిక్కెట్‌లను ముందస్తుగా రిజర్వ్ చేసుకోవచ్చు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి.
>
> – జే. శ్యామల, డిపో మేనేజర్, చీరాల

రీసర్వే గ్రామాల్లో సమస్యల పరిష్కారం



రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్ సింగారావు

జే.పంగులూరు: రీ సర్వే జరిగిన ఆరు గ్రామాల్లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని పంగులూరు తహసీల్దార్ సింగరావు సిబ్బందిని ఆదేశించారు. గురువారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. రీసర్వే గ్రామాల్లో జరిగిన రెవెన్యూ గ్రామ సభల్లో అనేక సమస్యలు వచ్చాయని, వాటిని రైతులు అర్జీలు ద్వారా తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. వాటిలో ఇద్దరు ముగ్గురు పేర్లు కలిపి ఉన్న వాటిని విడదీయడం, పేర్లు మార్పు, ఫోటో మార్పు మార్పులను 15 రోజుల్లో పూర్తిచేయాలని ఆదేశించారు. త్వరలో జరగనున్న నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ లిస్టులను తక్షణమే తయారు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సురేష్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

దేవాలయమా.. డంపింగ్ యార్డా ?



గుడి సమీపంలో రోడ్డుపై వేసిన చెత్తా, చెదారం

కారంచేడు: మండల కేంద్రం కారంచేడు వెంకటేశ్వర స్వామి సమీపంలోని పరిసరాలు చెత్తకంపు కొడుతున్నాయని పరిస్థితి గ్రామస్తులు, భక్తులు వాపోతున్నారు. వాడరేవు–పిడుగురాళ్ల జాతీయ ప్రధాన రహదారికి అనుకొని కారంచేడు–పర్చూరు రోడ్డులో ఈ దుస్థితి దర్శనమిస్తోంది. ప్రతి రోజు ఈ దారిలో వందల మంది ప్రయాణికులు దర్గంధాన్ని పీల్చుకుంటూ ప్రయాణాలు చేస్తున్నారు. గ్రామంలోని అనేక ప్రాంతాల్లో సేకరించిన ఈ చెత్తను మరికొంత దూరంలో ఉండే ఖాళీ స్థలంలో వేసుకోవచ్చని, ఇక్కడే వేయడం వలన ప్రధానంగా దేవాలయానికి వచ్చే భక్తులకు తీవ్ర ఇబ్బందిగా మారిందని భక్తులు వాపోతున్నారు. ఈ ప్రాంతంలో దేవాలయంతో పాటు, మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం, ఒక రెస్టారెంట్ సైతం ఉన్నాయని, సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించేలా ఈ డంపింగ్‌ను పాత జూనియర్ కాలేజీ దాటిన తరువాత వేసి తమకు కలిగిన సమస్యను తొలగించాలని భక్తులు, గ్రామస్తులు కోరుతున్నారు.

ఆధార్ సెంటర్‌తో ఉపయోగాలు



అధార్ సెంటర్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

జే.పంగులూరు: అన్ని గ్రామాల్లోని షెడ్యూలు తెగలు ఎరుకల, యానాది తదితర బలహీన వర్గాలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించడం కోసం వారికి ప్రత్యేకంగా ఆధార్ కార్డులు జారీ చేస్తోందని తహసీల్దార్ సింగారావు తెలిపారు. మండల కేంద్రంలోని పంగులూరు సచివాలయం–2 లో గురువారం సింగారావు ఆధార్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ కార్డులు తప్పులు, కొత్త పేర్ల నమోదు, అడ్రస్సు, జనన తేదీ తప్పులు నూతనంగా ఆధార్ కార్డులు జారీ చేస్తారని, ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అవగాహనతో క్యాన్సర్ మహమ్మారి దూరం

- సమాజాన్ని పీడిస్తున్న క్యాన్సర్‌ను తరిమికొడదాం
- ర్యాలీలు చేసిన వైద్య సిబ్బంది



చినగంజాంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



కొరిశపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యఆరోగ్య శాఖ సిబ్బంది

కారంచేడు/మార్టూరు/యద్దనపూడి/చినగంజాం: సమాజాన్ని పట్టి పీడిస్తున్న క్యాన్సర్ వ్యాధిని తరిమికొట్టేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని వైద్యులు పేర్కొన్నారు. గురువారం జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా అవగాహన కల్పించారు. స్వర్ణ, కారంచేడు పీహెచ్‌సీల వైద్యులు, వైద్య సిబ్బంది గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ షాలినీ, డాక్టర్ జెస్సీరాణీ మాట్లాడుతూ నోబెల్ గ్రహీత క్యూరీ పుట్టినరోజు సందర్భంగా 2014 నుంచి నవంబర్ 7వ తేదీన క్యాన్సర్‌పై అవగాహన దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. క్యూరీ 'న్యూక్లియర్ ఎనర్జీ రేడియోథెరపీ' అభివృద్ధికి ఈమె ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో వైద్యులు గోరంట్ల సురేష్‌బాబు, ఉష, ఎంపీహెచ్‌ఈఓ వీ నాగేశ్వరరావు, హెచ్‌వీలు మాధురీ సిఫోరా, వీ వీరమ్మ, హెచ్‌ఈ మీనాకుమారి, హెచ్‌ఎస్ డీ శ్రీనివాసరావు, బీ శంకర్, సుబ్బారావు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశలు, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

★ 40 ఏళ్ల వయసు దాటిన వివాహిత మహిళలు ఎప్పటికప్పుడు వైద్యుల సూచనల మేరకు క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెంటెంట్ డాక్టర్ అశోక్‌రెడ్డి అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు కే సుబ్రహ్మణ్యం, డాక్టర్ భానుచందర్ నాయుడు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ఎం కోటేశ్వరరావు,ఎం సాంబశివరావు స్థానిక మహిళలు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

★ క్యాన్సర్‌పై విజయం సాధించడం స్క్రీనింగ్‌తోనే సాధ్యమవుతుందని ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య, కేంద్ర వైద్యాధికారులు డాక్టర్ టీ అంజిని, జీ భానుప్రకాశరావు అన్నారు. అందరికీ క్యాన్సర్ పరీక్షలు కార్యక్రమంలో భాగంగా ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో గురువారం వైద్యాధికారులు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. నవంబర్ 11 నుంచి జరుగే క్యాన్సర్ పరీక్షలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ కోటేశ్వరరావు, పీహెచ్‌ఎన్ సహస్ర, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాలు, ఇతర వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

★ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా క్యాన్సర్ వ్యాధికి దూరంగా ఉండవచ్చని చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి ఎస్ విజయభాస్కర్ అన్నారు. చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఝాన్సీరాణి, హెల్త్ సూపర్ వైజర్ చిరంజీవి, ఎల్‌టీ శ్యాం, హెల్త్ అసిస్టెంట్ మురళి, మహేష్, పొదిలి రాఘవ, ఏఎన్‌ఎలు, సీహెచ్‌ఓలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

క్రమం తప్పని వైద్య పరీక్షలతో క్యాన్సర్‌కు చెక్..

బల్లికురవ/జే.పంగులూరు/మేదరమెట్ల: క్రమం తప్పని వైద్య పరీక్షలతో క్యాన్సర్‌కి దూరంగా ఉండవచ్చని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు బాలరాజేశ్వరి అన్నారు. పంగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ క్యాన్సర్ దినోత్సవంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పాఠశాల విద్యార్థులచే చెడు ఆహారం తినకుండా తగు జాగ్రత్తలు సంబంధించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యుడు కృష్ణకుమార్, హెచ్ఎం రమాదేవి, సీహెచ్‌వో భారతి, హెల్త్ ఎడ్యుకేటర్ అనురాధ, సూపర్ వైజర్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

★ కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల, కొరిశపాడు పీహెచ్‌సీల ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపేలా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి గురించి ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు నిఖిలారెడ్డి, చిట్టిబాబు, హరికృష్ణ, మనోజ్, అక్షిత, రాజశేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

★ గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు షేక్ రమీజ్ అహ్మద్, రవితేజ ఆధ్వర్యంలో గుంటుపల్లి పీహెచ్‌సీ నుంచి క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు బల్లికుర వరకు ర్యాలీ నిర్వహించారు.



గుంటుపల్లిలో క్యాన్సర్‌పై ర్యాలీగా బయలుదేరిన వైద్యులు, వైద్య సిబ్బంది



మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు



స్వర్ణలో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ చేస్తున్న డాక్టర్ షాలినీ, వైద్య సిబ్బంది

జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పని



సభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసమూర్తి

చినగంజాం: ఉపాధి హామీ పథకం ద్వారా జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి పని కల్పించి వారికి ఉపాధి చూపడమే ధ్యేయం అని ఎంపీడీఓ ఏవీ శ్రీనివాసమూర్తి అన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామ పంచాయతీల పరిధిలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి పనుల గుర్తింపు, నిర్వాహణకు సంబంధించి గురువారం మండలంలోని చినగంజాం, కొత్తపాలెం, సంతరావూరు, గొనసపూడి, కడవకుదురు గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో ఇప్పటి వరకు గుర్తించిన పనులను గ్రామ సభలో చదివి వినిపించారు. ఉపాధి పనులను సక్రమంగ వినియోగించుకోవాలని ఎంపీడీవో కోరారు. కార్యక్రమంలో ఏపీఓ జే లక్ష్మీదేవి, గ్రామ సర్పంచ్‌లు ఆసోది బ్రహ్మానందరెడ్డి, రాయని ఆత్మారావు, కార్యదర్శులు బాబురావు, కృపారావు , ఉపాధి హామీ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.